క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంటూరు ఈస్ట్ : విద్యుత్ లైన్‌ల నిర్వహణ నిమిత్తం అరండల్‌పేటలో ఈనెల 18వ తేదీ ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాల అంతరాయం ఏర్పడుతోందని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ముస్తాక్ అహ్మద్ బుధవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే నెహ్రూనగర్ ఉప కేంద్రం పరిధిలో నూతన విద్యుత్‌లైనులు ఏర్పాటు చేస్తున్న కారణంగా ఈనెల 18వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సి.హెచ్.ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంటాద్రిపేట, మోతిలాల్ ఫీడర్, నెహ్రూనగర్, న్యూ రైల్వే స్టేషన్ రోడ్డు పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు.

గ్రూప్-2 మెయిన్స్‌కు 48 మంది ఎంపిక

నెహ్రూనగర్: బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షకు శిక్షణ పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల్లో 48 మంది మెయిన్స్ పరీక్షలకు ఎంపికైనట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 86 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, అభ్యర్థులతోపాటు, గుంటూరు జిల్లాకు చెందిన మరో 50 మంది (ఈడబ్ల్యూఎస్) అభ్యర్థులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి వారికి స్పాన్సర్ చేయడం జరిగిందన్నారు. మొత్తంగా 48 మంది గ్రూప్-2 మెయిన్స్‌కు అర్హత సాధించారన్నారు. త్వరలో గ్రూప్-2 మెయిన్స్‌కు కూడా ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు.

దళిత సంఘాల హర్షం

నెహ్రూనగర్: ఎస్సీ ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం శిరోముండనం కేసులో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులను దోషిగా నిర్ధారించి జైలు శిక్ష వేయటం పట్ల దళిత సంఘాలు వర్షం వ్యక్తం చేస్తున్నాయి. భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పగల ప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం లాడ్జి సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావు, సురేష్, కాకి నాగేశ్వరరావు, మాల్యాద్రి, చిన్నం డేవిడ్ విలియమ్స్, సుధాకర్, ప్రభుదాస్, సమత తదితరులు పాల్గొన్నారు.

శ్రీమేధ ఆధ్వర్యంలో శోభాయాత్ర



శోభాయాత్రను ప్రారంభిస్తున్న నందకిషోర్

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీరాముడు ధర్మ స్వరూపుడైన ఆదర్శ పురుషుడని శ్రీమేధ విద్యాసంస్థల డైరెక్టర్ అన్నా నందకిషోర్ అన్నారు. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా శ్రీమేధ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నగరంలో శోభాయాత్రను నిర్వహించారు. కొత్తపేటలోని లక్ష్మీభవన్ క్యాంపస్ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర గౌడీయమఠం, పాత బస్టాండ్, జిన్నాటవర్ సెంటర్, శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరం, నాజ్ సెంటర్ మీదుగా తిరిగి కొత్తపేటకు చేరుకుంది. ఈసందర్భంగా శ్రీరామ నామ సంకీర్తనలతో పాటు జై శ్రీరామ్ నినాదాలతో సాగిన శోభాయాత్రలో శ్రీమేధ విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నందకిషోర్ మాట్లాడుతూ ప్రతీ ఏటా శ్రీరామనవమి రోజున జరిగే లోకోత్తరమైన సీతారాముల కల్యాణం కడు కమనీయమన్నారు. సీతామాతను అపహరించిన రావణాసురుడిని వధించడం ద్వారా కోదండ రాముడు రణధీరుడు అయ్యారన్నారు. అంతటి మహత్తరమైన సీతారామ చరితను అందరు తెలుసుకుని, ఆచరించాలన్నారు. శోభాయాత్రలో సంస్థ ప్రిన్సిపాల్ తిరుపతి స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

పెదబాపిరెడ్డికి సత్కారం

లక్ష్మీపురం:మువ్వాపెదబాపిరెడ్డి చదువుకుంటున్న సమయంలోనే చాలా నాగమ్మ నాటకంలో బాలవర్ధిరాజుగాను, వీరబ్రహ్మేంద్ర స్వామి నాటకంలో సిద్ధయ్య పాత్ర వంటి అనేక నాటకాలలో పేరు తెచ్చారని సాంస్కృతిక కార్యక్రమాల కో ఆర్డినేటర్ బిళ్ళా అశోక్, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం నాటక రంగ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో మాట్లాడుతూ పౌరాణిక రంగస్థల అభినయ సవ్యసాచి, మృదుమధుర ప్రవచన సామ్రాట్‌గా పేరొందిన మువ్వా పెదబాపిరెడ్డి జీవితమంతా పౌరాణిక చారిత్రాత్మక, సాంఘిక నాటకాలతో కళా హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించారన్నారు. అనంతరం సంస్థ సభ్యులు బాపిరెడ్డిని ఘనంగా సత్కరించారు. అలాగే చార్లీచాప్లిన్ నేటి తరానికి మార్గ నిర్దేశకుడని ప్రముఖ నాటక రచయిత కావూరి సత్యన్నారాయణ అన్నారు. స్థానిక అరండల్ పేట అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం చార్లీచాప్లిన్ జయంతిని సందర్భంగా ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పెదబాపిరెడ్డిని సత్కరిస్తున్న సభ్యులు

మన భవిష్యత్ మన చేతుల్లోనే

- వచ్చే ఎన్నికల్లో మనకు మేలు చేసే వారినే ఎన్నుకుందాం
- ఫ్యాను గుర్తుకు ఓటేస్తేనే మన జీవితాల్లో వెలుగులు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- గుంటూరు 31, 33 డివిజన్లలో మనతో మన రజినమ్మ కార్యక్రమం



ప్రచారంలో పాల్గొన్న మంత్రి రజిని, ఎమ్మెల్యే గిరి



వృద్ధురాలితో ఆప్యాయంగా మంత్రి రజిని

పట్నంబజారు: మన భవిష్యత్ మన చేతుల్లోనే ఉందని, వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో మేలు చేసే వ్యక్తులను ఎన్నుకుంటే వచ్చే ఐదేళ్లు మన జీవితాలతో పాటు, రాష్ట్ర భవిష్యత్ కూడా బాగుంటుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. గుంటూరు నగరంలోని 31, 33 డివిజన్లలో బుధవారం మనతో మన రజినమ్మ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ జగనన్నను గెలిపిస్తే ఇప్పుడు జరుగుతున్న మంచి అంతా కొనసాగుతుందని, దుష్టగహ కూటమికి ఓటేస్తే మన బతుకుల్ని మనమే నాశనం చేసుకున్నట్లవుతుందని పేర్కొన్నారు. పెత్తందారీ పార్టీలన్నీ కూటములు కట్టి జగనన్నను ఒంటరివాడిని చేశామని ఆనందంలో ఉన్నాయని, కాని జగనన్న వెనుక కోట్లాదిమంది ప్రజలు ఉన్నారన్న విషయాన్ని మరిచారన్నారు. వలంటీర్లపై ప్రతిపక్ష నాయకులు విషం చిమ్ముతూనే ఉన్నారని దుయ్యబట్టారు. ఏ సర్వే చూసినా వైఎస్సార్ సీపీనే విజయం సాధిస్తుందని చెబుతున్నాయని, అది చూసి ఓర్వలేక జగనన్నపై భౌతికదాడికి సైతం తెగించారని మంత్రి రజిని వివరించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా అంతిమ విజయం వైఎస్సార్ సీపీదేనని మంత్రి రజిని స్పష్టం చేశారు.

పేదలకు భరోసా జగనన్నే: ఎమ్మెల్యే గిరి

పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదరికం నిర్మూలనే ధ్యేయంగా పరిపాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. బీసీలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిన నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అన్ని అంశాల్లో పూర్తి స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు.

అపూర్వ స్పందన

నియోజకవర్గంలోని 33 వ డివిజన్ అశోక్‌నగర్, దేవాపురం, పండరీపురం, బ్రాడీపేట ప్రాంతాల్లో మంత్రి రజిని పర్యటించారు. దేవాపురం ప్రాంతంలో మహిళలు ఎదురేగి స్వాగతం పలికారు. మంత్రి రజిని వారిని ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గెలిపిస్తే నియోజకవర్గంలో మునుపెన్నడూ జరగనంత అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు. సాయంత్రం 31వ డివిజన్‌లో ఏటీ అగ్రహారం 5, 6, 7 లైన్‌లు, గాంధీ నగర్, మహబూబ్ నగర్, బండ్లబజారు లైన్‌లు, వెంకటకృష్ణ కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. రెండు డివిజన్ల లోనూ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. టీవీ రావు, కార్పొరేటర్లు గోపిశ్రీనివాస్, అందుగుల సంతోష్, వైఎస్సార్ సీపీ నాయకులు ఆనం సంజీవ రెడ్డి, చల్లా శేషిరెడ్డి, ఆంజనేయులు, బొగిశం ప్రసాద్, గేదెల రమేష్, అరవా తిమ్మరాజు, ఎం.శ్రీనివాసరెడ్డి, సతీష్‌రెడ్డి, గనిక ఝాన్సీ, సంగా రవీంద్ర, పరిశ వెంకట్, ఏ శివ, లక్ష్మీనరసారెడ్డి, బి. నవీన్, వి. హేమంత్, ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురు చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి స్వాగతం పలుకుతున్న నూరిఫాతిమా

పట్నంబజారు: ప్రతి పేదవాడి గడపకు సంక్షేమాన్ని అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 57వ డివిజన్ అంబేడ్కర్ నగర్ 2వలైనుకు చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 50 కుటుంబాలు మహిళ నేత వై.రాణి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. అనంతరం 7వ డివిజన్ గుంటూరువారితోటకు చెందిన టీడీపీ, జనసేనకు సంబంధించి 60 కుటుంబాలు దస్తగిరి, లాల్‌బిల ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి మెరుగైన భవిష్యత్ ఉంటుందన్నారు. ఖచ్చితంగా రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని, ప్రతి పేదవాడికి మేలు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పఠాన్ రిహానా, నూర్‌ఖాన్, కోలాభవానీ, మణికంఠ, వెంకట్రామిరెడ్డి, బాజీ, కల్పన, వాసు, ఐటీసీ శ్రీను, వెంకటేశ్వర్లు, హుస్సేన్, శివ, నాచాంరరెడ్డి, యూసఫ్, ఖలీల్, అజయ్, ఇమ్రాన్, ఖాజా, ప్రశాంత్, ఫయాజ్, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

రావణ కూటమి కూలేది తథ్యం



చిన్నారులతో కలిసి పానకం కలుపుతున్న నూరిఫాతిమా

పట్నంబజారు: సీతారాముల ఆశీస్సులతో రాష్ట్రంలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి, టీడీపీ, జనసేన, బీజేపీతో ఏర్పడ్డ రావణ కూటమి కుదేలు కావాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా ఆకాంక్షించారు. శ్రీరామ నవమి పురస్కరించుకుని 2, 4, 53 డివిజన్‌ల పరిధిలోని సీతానగర్, తమ్మారంగారెడ్డినగర్, సంజీవయ్యనగర్, నాగేంద్ర స్వామి పుట్ట, రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మనమంతా కలిసి కట్టుగా జగనన్న అందించే రామ రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మర్రి అంజలి, మహమూద్, ధూపాటి వంశీ, వైఎస్సార్‌సీపీ నేతలు మర్రి సత్యనారాయణ, ధూపాటి సాల్మాన్, నాగేశ్వరరావు, శ్రీను,సుబ్బులు, ఆదినారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, గోపి, జంగం దాసు, మరియమ్మ, ఏసమ్మ తదితరులు పాల్గొన్నారు.

మీ అందరి ఆశీర్వాదంతో నామినేషన్ వేస్తున్నా

- గెలిపించండి వెన్నంటి ఉంటా
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజిని

పట్నంబజారు: మీ అందరి ఆశీర్వాదంతో.. ఈ నెల 20వ తేదీన నామినేషన్ దాఖలు చేయబోతున్నా.. ప్రతి ఒక్కరి చల్లని దీవెనలు నాపై ఉండాలని కోరుకుంటున్నా.. ఒక్కటి మాత్రం గుర్తు పెట్టుకోండి.. నేను మీ రజినమ్మను.. ఎటువంటి కష్టంలోనైనా తోడుగా ఉంటా.. సంతోషాన్ని అందరం కలిసి పంచుకుందాం.. ఆపదలో వెన్నంటి కాపలా కాస్తా.. మీ ఇంటి బిడ్డలా రానున్న ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో తనని భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. నామినేషన్ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లపై చంద్రమౌళినగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ ముఖ్యనేతలు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ మీ అందరిపై నమ్మకంతో.. సీఎం జగనన్న నన్ను ఇక్కడకు పంపారు.. టీడీపీ కంచుకోట అని చెప్పుకుంటున్న పశ్చిమ నియోజకవర్గాన్ని నేను.. సీఎం జగనన్నకు గిఫ్ట్‌గా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా.. మీరంతా సిద్ధమేనా.. పిలుపునిచ్చారు. 20వ తేదీ ఉదయం 9:30 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేయబోతున్నామని తెలిపారు. చరిత్రలో నిలిచిపోయేలా భారీ ర్యాలీగా కార్యక్రమానికి హాజరవుతారని చెప్పారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ చరిత్రలో సరికొత్త చరిత్రకు నాంది వైఎస్సార్ సీపీ నామినేషన్ ప్రక్రియే కావాలని పిలుపునిచ్చా రు. పార్టీ నాయకులంతా తరలిరావాలని, కార్యకర్తలు పెద్దఎత్తున ఈ కార్యక్రమానికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఆయా డివిజన్ల నుంచి తరలివచ్చే ప్రజలను సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత కార్పొరేటర్లదేనని చెప్పారు. సమావేశంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, ఇన్‌చార్జీలు, అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, మండల ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి



నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బారీకేడ్

నెహ్రూ నగర్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నామినేషన్ దాఖలు చేయడానికి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సాధారణ ఎన్నికల్లో నేటి నుంచి నామినేషన్ల దాఖలుకు ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం నగర పాలక సంస్థ పరిధిలోని గుంటూరు తూర్పు (95), పశ్చిమ (94) నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థుల నుంచి నామినేషన్స్ స్వీకరిస్తామన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించి కమిషనర్ చాంబర్‌లో, గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి సిటీ ప్లానర్ చాంబర్లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల నుంచి నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి నామినేషన్ల ఫారాలు అందించడం, ఫారాల పూర్తికి అవసరమైన సూచనల కోసం హెల్ప్ డెస్కుల ఏర్పాటు జరిగిందని తెలిపారు. నామినేషన్లు స్వీకరించే జీఎంసీ ప్రధాన కార్యాలయం పరిసరాల్లో బారీ కేడింగ్ ఏర్పాటు చేశామని, నగర పాలక సంస్థ ఉద్యోగులు కూడా గుర్తింపు కార్డ్‌లు ధరించి కార్యాలయ విధులకు హాజరు కావాలని ఆదేశించారు.

మతసామరస్యంలోనే ఆనందం ఉంది



వాహనదారులకు మజ్జిగ అందజేస్తున్న డాక్టర్ షమ సుల్తానా

గుంటూరు మెడికల్: మతసామరస్యంలో ఉన్న ఆనందం కంటే మరొకటి ఉండదని గైనకాలజిస్ట్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, హోప్ విన్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ షమ సుల్తాన అన్నారు. తండ్రికి ఇచ్చిన మాట కోసం రాజ్యాన్నే త్యజించిన గొప్ప పాలకుడు శ్రీరామచంద్రుడు ఆమె కొనియాడారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా బుధవారం గుంటూరు నగరంలోని పలు ప్రాంతాల్లో పాదాచారులు, వాహనదారులకు డాక్టర్ షమ సుల్తాన మజ్జిగ పంపిణీ చేశారు. దీంతో మండుటెండలో మజ్జిగ ఇచ్చి దాహాన్ని తీర్చిన డాక్టర్ షమ సుల్తానకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డాక్టర్ షమ సుల్తాన మాట్లాడుతూ రాముని కాలంలో ధర్మం నాలుగు పాదాలపై నడిచిందని, ఈ నేపథ్యంలో రాముని వంటి రాజు కోసం, రామరాజ్యం నాటి పాలన కోసం నేటికీ ప్రజలు పరితపిస్తుంటారని అన్నారు. భారతదేశంలోని నేటి రాజకీయ నాయకులు ప్రతి ఓటర్‌ను తమ ఓటు బ్యాంకుగా మార్చుకునేందుకు అన్నదమ్ముళ్లలా.. అన్నాచెల్లెళ్లలా కలిసిమెలిసి ఉంటున్న తమను కులాలు, మతాల పేరుతో విడదీస్తున్నారని అలాంటి కుట్రలకు తాము అవకాశం ఇవ్వమన్నారు. కార్యక్రమంలో హోప్ విన్ హాస్పటల్ మేనేజర్ పి. నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



బాబూ రాజేంద్రప్రసాద్ కాలనీలో జరిగి కల్యాణంలో భక్తులు



త్యాగరాజ మందిరంలో కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

ఆణి ముత్యములు తలంబ్రాలుగా..

- వైభవంగా సీతారాముల కల్యాణం
- వాడవాడలా చలువ పందిళ్లు



సాకేతపురం సెంటర్‌లో గరుడ వాహనంపై ఊరేగింపులో శ్రీసీతారాములు



సాకేతపురంలో సీతారాముల కల్యాణంలో గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి



ఆంజనేయపేట శ్రీకోదండరామాలయంలో శ్రీసీతారాముల కల్యాణం



రామన్నపేట రోడ్డులో తోపుడు బండిపై సీతారాముల కల్యాణం చేస్తున్న చిరు వ్యాపారి



కొరిటెపాడు శ్రీరామాలయంలో శ్రీసీతారాముల కల్యాణం చేస్తున్న అర్చకులు



బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాత గుంటూరు: వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల హోరు.. భక్తుల శ్రీరామ నామస్మరణ మధ్య కోదండ రాముని కల్యాణం కమనీయంగా జరిగింది. ఆ పెళ్లి వేడుకను చూసిన భక్తజనం పరవశించారు. నగరంలో శ్రీరామనవమి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఆలయాలతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో ఎక్కడ చూసినా పెళ్లి సందడే కనిపించింది. భక్తులతో రామాలయాలతో పాటు వివిధ ఆలయాలు కిటకిటలాడాయి.

కొరిటెపాడులో...

కొరిటెపాడు గాంధీ బొమ్మ సెంటర్ శ్రీ కోదండ రామాలయంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, సహస్రనామార్చన తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశేషంగా స్వామి వారు చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు, ప్రముఖులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.



కొరిటెపాడు కోదండరామాలయంలో అలంకరణ

ఆలయ చైర్మన్ కొమ్మినేని శివ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కిలారి ఆదినారాయణ, కార్యదర్శి కొమ్మినేని ప్రసాద్, సభ్యులు కే కోటేశ్వరరావు, కే. నాగేశ్వరరావు, పి శ్రీనివాస్, కిలారి రత్తయ్య, సీతారామయ్య తదితరులు పర్యవేక్షించారు.

- బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం పాలకమండలి ఆధ్వర్యంలో ఆలయ అర్చక బృందం శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. హారతి అనంతరం విశేషంగా పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు;
- లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణం విశేషంగా నిర్వహించారు.
- శ్రీ రామనామక్షేత్రంలో రాగం వెంకట లీలాసుందరి , మస్తాన్‌రావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కల్యాణాన్ని విశేషంగా నిర్వహించారు.
- బాబూరాజేంద్రప్రసాద్ కాలనీ లోని మన రామాలయం లో శ్రీ సీతారాముల కళ్యాణం అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలయ అర్చకులు నిర్వహించారు. హారతి అనంతరం తీర్థ ప్రసాద వితరణజరిగింది.
- స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీ శ్రీ షిరిడీ సాయి నాథ మందిరంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ గౌరవ అధ్యక్షులు మామిడి రామారావు, అధ్యక్షులు మామిడి సీతారామయ్య తదితరులు పర్యవేక్షించారు.



రామనామ క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



కొరిటెపాడులో కోదండ రామాలయంలో పాల్గొన్న భక్తులు

శ్రీరాముని జీవితం ఆదర్శనీయం

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో ఘనంగా శ్రీరామనవమి
- సీతారాములకు తలంబ్రాలు పోసి తరించిన భక్తజనం

పట్నంబజారు: శ్రీరాముని జీవితం ఆదర్శనీయమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని బుధవారం బ్రాడీపేట 2వలైనులోని ఓంకార క్షేత్రంలో సీతారాముల వారిని దర్శించుకుని, కల్యాణంలో కూర్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ తండ్రికి ఇచ్చిన మాట కోసం వనవాసం చేసిన మహనీయుడు శ్రీరాముడని కీర్తించారు. సనాతన ధర్మానికి, భారతీయ సంస్కృతికి నిలువెత్తు రూపం నీలమేఘశ్యాముడని చెప్పారు. గుంటూరు పశ్చిమ పరిధిలోని చలువ పందిళ్లలో వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, స్థానిక కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కిలారి రోశయ్య పూజలు

పట్నంబజారు: శ్రీరామ నవమిని పురస్కరించుని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య పలు రామాలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, అర్చకుల నుండి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ ధర్మానికి, హైందవ సంస్కృతికి ప్రతీక శ్రీరాముడు అని కీర్తించారు. సీతారాముల కల్యాణ మహోత్సవం జరిగిన నవమి నుంచి ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఆకాక్షించారు.

గొట్టిపాడు వాసుల ఆగ్రహం



ప్రత్తిపాడు: రెవెన్యూ అధికారుల తీరుపై పెదగొట్టిపాడు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో రక్షిత మంచినీటి చెరువు పూర్తిగా ఎండిపోయిందని, ప్రస్తుతం సాగర్ జలాలను ప్రభుత్వం విడుదల చేసిన నేపథ్యంలో తమ చెరువులను నింపుకునేందుకు కూడా అవకాశం ఇప్పించాలని కోరేందుకు గొట్టిపాడు టీడీపీ సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు బుధవారం ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అదే సమయంలో కార్యాలయంలో విధుల్లో ఉన్న ఓ అధికారి తమపట్ల అభ్యంతరకరంగా మాట్లాడుతూ గ్రామస్తులు తీవ్రంగా ఆగ్రహించారు. ఏమిటిక్కడ మీ న్యూసెన్స్.. ముందు గొడవ చెయ్యకండి.. బయటకు వెళ్లిపోండంటూ సర్పంచ్‌తో పాటు గ్రామస్తులను ఆ అధికారి అవమానించారని ఆరోపించారు. ప్రజలంటే ఎందుకంత చులకనంటూ మండిపడ్డారు. ఆయన బయటకు వచ్చి సమాధానం చెప్పే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ తహసీల్దార్ గది బయటే ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో తహసీల్దార్ పద్మజ పొరబాటు జరిగిందని సర్దిచెప్పారు.